క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని కమ్మగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కమ్మగూడ, సుందరయ్యనగర్, టీచర్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, సాగర్ రహదారి పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు బ్రాహ్మణపల్లి రోడ్, గణేశ్‌నగర్, వినాయక హిల్స్, సంపద హోమ్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ఉపాధి రంగాలపై యువత దృష్టి సారించాలి

జెడ్పీటీసీ దశరథ్‌నాయక్



మీ-సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: యవత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలో ఎస్ఎస్ కమ్యూనికేషన్ మీ-సేవ కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు లక్ష్మనర్సింహరెడ్డి, శంకర్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ తదితరులున్నారు.

గ్రామాభివృద్ధికి నిధులివ్వండి

సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

మంచాల: గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు ఇవ్వాలని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం ఆరుట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మండలంలోనే మేజరు గ్రామ పంచాయతీ కావడంతో నిధుల కొరతతో పాటు సమస్యలు కూడా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగయ్య గౌడ్, మాజీ సర్పంచ్‌లు జంగారెడ్డి, యాదయ్య, మోహన్ నాయక్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో ఆవు మృతి


విద్యుదాఘాతంతో చనిపోయిన ఆవు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని పెద్దతాండాకు చెందిన శంకర్‌కు చెందిన పాడి ఆవు గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. శంకర్ మేత కోసం ఆవును పొలానికి తీసుకెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకి విద్యుదాఘాతంలో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వపరంగా సాయం అందించి బాధితుడిని ఆదుకోవాలని సర్పంచ్ కోరారు.

బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడుదాం


కొంగరకలాన్ తండా గిరిజనులతో మాట్లాడుతున్న శేఖర్‌గౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి కొంగర కలాన్ తండాలో శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేదని, రాచరిక పాలన సాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్గానికి మోక్షం ఎప్పుడు..?

పొలానికి వెళ్లాలంటే వాగు దాటాల్సిందే

- రైతన్నలకు తప్పని తిప్పలు
- బ్రిడ్జి నిర్మించాలని గిరిజనుల మొర

మంచాల: శీత్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కొర్రం తండా గిరిజనులు వేడుకుంటున్నారు. మంచాల మండలంలోని కొర్రం తండాలో 500 వరకు జనాభా ఉంటుంది. వీరంత వ్యయసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కొర్రం తండాను ఆనుకుని శీత్ల వాగు (పెద్ద వాగు) ఉంది. వర్షాలకు వాగు పారుతుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గ్రామంలోని రైతులకు సంబంధించిన వ్యవసాయం పొలం 450 ఎకరాలు వాగు అవతల ఉంది. రైతులు పొలాలకు వెళ్లాలంటే ఈ వాగు దాటి పోవాల్సిందే. ప్రభుత్వం తక్షణమే బ్రిడ్జి నిర్మించి.. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఎమ్మెల్యే దృష్టికి తెచ్చాం



కొర్రం తండా ప్రజలు ఎదుర్కొంటున్న శీత్ల వాగు సమస్యను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. వాగుపై బ్రిడ్జి నిర్మించాలని సూచించారు. బ్రిడ్జి నిర్మాణం జరిగితే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. – కొర్ర శంకర్ నాయక్, కొర్రం తండా

పరిశీలిస్తున్నాం



కొర్రం తండాలో శీత్ల వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం పరిశీలిస్తున్నాం. చుట్టూ వరి పొలాలున్నాయి. పంట కోసిన తరువాత.. వేసవి కాలంలో నిర్మాణ పనులకు అనుకూలంగా ఉంటుంది. – ఎండీ అబ్బాస్, డీఈఈ, పంచాయతీరాజ్‌శాఖ

‘గృహలక్ష్మి’కి దరఖాస్తుల వెల్లువ

- కార్యాలయాల ఎదుట బారులు
- మొదటి రోజు 626 దరఖాస్తులు

మంచాల: గృహలక్ష్మి పథకానికి లబ్ధిదారులు భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ నెల 12వ తేదీ వరకే గడువు విధించడంతో దరఖాస్తు చేసేందుకు మీ–సేవ కేంద్రాలు, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో పేదలు బారులుదీరారు. గురువారం ఒక్కరోజే 626 మంది అర్హులు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎంపీడీఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు.

యాచారం మండలంలో 352 దరఖాస్తులు

యాచారం: గృహలక్ష్మి పథకానికి గురువారం 352 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలో గృహలక్ష్మి పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించలేదు.


మంచాల: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న అర్హులు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుల కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి అర్హులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు 352 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

సీఐ మన్మోహన్



అబ్దుల్లాపూర్‌మెట్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ సూచించారు. సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల ద్వారా వస్తున్న సందేశాలకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బ్యాంక్ అధికారులు సెల్‌ఫోన్‌కి వచ్చిన ఓటీపీని అడుగరని, అలాంటి సందేశాలను ఎవరికీ షేర్ చేయకూడదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో వీడియో కాల్స్‌లో మాట్లాడకూడదన్నారు. అంతేకాకుండా సైబర్ నేరగాళ్లు మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఆన్‌లైన్ మోసాలకు పాల్పడితే 1930 నంబర్‌కు వెంటనే సమాచారమివ్వాలని పేర్కొన్నారు. పేటీఎం, బ్యాంక్ అకౌంట్, సిమ్ అప్‌డేట్ చెయ్యమని వచ్చే మెస్సేజ్‌లు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

నిరుపేదలకు అండ సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కొండత అండగా నిలుస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా గురువారం అందజేశారు. కావలి నర్సింహాకు రూ.31000, పగిడిమర్రి నర్సింహా రూ.17వేలు, సురేశ్‌కు రూ.16వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోల్కంపల్లి ఎంపీటీసీ రవీందర్, నాయకులు జంగయ్య, అంజయ్య, అయిలయ్యలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: స్వచ్ఛంధ సంస్థలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ సూచించారు. గురువారం మండలంలోని ముద్విన్ గ్రామంలో సర్వ్ సీబీఆర్ ప్రాజెక్ట్ దివ్యాంగుల సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్ పాసులు, దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న సర్వ్ సంస్థకు సహాయాన్ని ఎంపీపీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, సంస్థ అధ్యక్షురాలు మీనాక్షీ, సర్పంచ్ యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తదితరులు

ఆంబోతుతండాలో కాంగ్రెస్ ‘పల్లె నిద్ర’


ఆంబోతుతండాలో పల్లె నిద్రలో మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: కాంగ్రెస్ పార్టీ పిలుపుతో మంచాల మండలంలో ఆ పార్టీ నేతలు బుధవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఆంబోత్ తండాలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పటేల్ చెరువు తండాలో పీసీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి పల్లె నిద్ర చేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీలు తీశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను నేతలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు. పటేల్ చెరువు తండాలో బలగం సినిమాను ప్రదర్శించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సర్పంచ్ బక్కి కుమార్

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ పౌష్టిక ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. గురువారం మండలంలోని చంద్రధన అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు సమూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ, సార చీరలతో మహిళలకు సీమంతాలను ఘనంగా నిర్వహించారు. ఈ సర్పంచ్ మాట్లాడుతూ మహిళల సాధికరత కోసం కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. స్త్రీలు విద్యలో రాణించినప్పుడే ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని సుఖప్రధంగా ప్రసవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్ కుమార్, వార్డు సభ్యులు కృష్ణవేణి, యాదగిరి, రేణుక, యాదయ్య, సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు హంసమ్మ, సువర్ణ, మాజీ ఉప సర్పంచ్ ప్రసాద్, హైస్కూల్ చైర్మన్ జంగయ్య, తిరుపతయ్య, అంకుశ్, లావణ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక సీమంతాల్లో పాల్గొన్న సర్పంచ్

‘బొందలగడ్డగా మార్చొద్దు’

తలకొండపల్లి: ఖానాపూర్ గ్రామ పంచాయతీ ప్రభుత్వ భూమిలో కబరస్థాన్ నిర్మించవద్దని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖానాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో సర్వే నంబర్ ఎస్ఎన్ఓ. 256/1లో గల 42 ఎకరాల్లో ముస్లింలకు ఖబర్‌స్తాన్ నిర్మించాలని ప్రభుత్వం జీఓ జారీ చేసిందని తెలిపారు. శ్మశానవాటిక నిర్మాణాన్ని ఆపాలని కోరారు. మండలాన్ని బొందలగడ్డగా మార్చమేమిటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో పాండు, మల్లేశ్, కుమార్, గణేష్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ తదితరులు

విద్యాబోధనలో రాజీపడొద్దు


ఎండీ రఫిక్‌ను సన్మానిస్తున్న హబీబుద్దీన్

యాచారం: విద్యార్థులకు మెరుగైన విద్యనందించే విషయంలో రాజీపడొద్దని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఎండీ హబీబుద్దీన్ పేర్కొన్నారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రారంభం నుంచే మెరుగైన విద్యనందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఎండీ రఫిక్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కల్పన, ఉప సర్పంచ్ జగన్, వార్డు సభ్యుడు శ్రీనువాస్‌గౌడ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదలకు ఉపాధి కల్పనే ధ్యేయం


నాగిరెడ్డిగూడ తండాలో పర్యటిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: పేద ప్రజలకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ఐక్యత ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తున్నామని, ఆ సంస్థ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం కడ్తాల్ మండలం న్యామతాపూర్ పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిగూడ, రావిచేడ్, మద్దెలకుంట తండాల్లో పర్యటించారు. నాగిరెడ్డిగూడ తండాలో నిర్మిస్తున్న మేరమ్మయాడి, సేవలాల్ ఆలయ నిర్మాణాలకు సహాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భారతమ్మ, నాయకులు వితలయ్యగౌడ్, యాదయ్య, జనార్దన్‌గౌడ్, యాదయ్య, రామస్వామి, ధర్మనాయక్,పారేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


మంచాల నూతన తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సికిందర్‌రెడ్డి తదితరులు

మంచాల: మంచాల తహసీల్దార్‌గా వెంకట ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్‌ను బీఆర్ఎస్ నాయకుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సికిందర్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మంచాల: మంచాలలోని పాథమిక పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు సుగంధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కులు, విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందని తెలిపారు. శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతూనే ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కిషన్, మండల అధ్యక్షుడు అజ్మత్ ఖాన్, ప్రధాన కార్యదర్శి బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మినర్సింహారెడ్డి

కడ్తాల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని సర్పంచ్ గూడూరు లక్ష్మినర్సింహారెడ్డి తెలిపారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ అందించడం లేదని, సకాలంలో వైద్య అందడం లేదని గ్రామస్తులు తెలిపారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, బిక్షపతి, గణేశ్ తదితరులున్నారు.

రేపు తుర్కయంజాల్‌లో గద్దర్ సంతాప సభ

తుర్కయంజాల్: ప్రజాగాయకుడు గద్దర్ సంతాప సభను తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో ఈ నెల 12న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి హయత్‌నగర్ మండల జేఏసీ నాయకులు కందాల బల్‌దేవ్ రెడ్డి, కొంతం యాదిరెడ్డి తెలిపారు. ఈ సభకు సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని గురవారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఉమ్మడి హయత్ నగర్ మండలంలోని పలు ఘాలు, అంబేద్కరాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, యువజన సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నర్సింహ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు అశ్విని, సీపీఎం జిల్లా నాయకులు కిషన్, నాయకులు విష్ణు, దాసు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

ఉద్యమం ఆగదు


గట్టుఇప్పలపల్లిలో దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు తదితరులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని ఆ గ్రామ జేఏసీ నాయకులు చేపట్టిన నిరాహార దీక్ష గురువారానికి 39వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ మండల ఏర్పాటు కోసం గతంలో జేఏసీ ఆధ్వర్యంలో 41 రోజులు నిరాహార దీక్షలు చేశామని తెలిపారు. అప్పట్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గట్టుఇప్పలపల్లిని మండలంగా ఏర్పాటు చేస్తానని స్పష్టమైన హామీ ఇవ్వడంతో దీక్షను విరమించామని గుర్తుచేశారు. ఎమ్మెల్యే నిలబెట్టుకుని మండలాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలాన్ని ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దామోదర్, రేణురెడ్డి, రాజు, రాజేందర్, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, డేవిడ్, చెన్నయ్య, దైవానందం, కృష్ణయ్య, చంద్రయ్య, బాలయ్య, జంగారెడ్డి, శ్యామ్, జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు మృతి


మస్కు చంద్రయ్య (ఫైల్ ఫొటో)

యాచారం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. యాచారం గ్రామ పంచాయతీలో మస్కు చంద్రయ్య(45) వాటర్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల చంద్రయ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఇబ్రహీంపట్నంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య యాదమ్మ, ముగ్గురు కుమార్తెలున్నారు.

నివాళులర్పించిన ఎంపీపీ

మస్కు చంద్రయ్యకు యా చారం ఎంపీపీ కొప్పు సుకన్య నివాళులర్పించారు. చంద్రయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని, మృతుడి భార్యకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని ఎంపీపీ ప్రభుత్వాన్ని కోరారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

జెడ్పీటీసీ వెంకటేశ్

తలకొండపల్లి: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. లక్ష్య సాధనతో విద్యార్థులు విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 242 మంది విద్యార్థులకు ఉచితంగా ఆయన దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామంలో నిర్మించిన ఉచిత ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఇళ్లు పూర్తి కాగా, మరో 30 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ సుధాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ రాజేందర్, రవీందర్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

కబరస్థాన్‌ను రద్దు చేయాలి

ఖానాపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో కబరస్థాన్ నిర్మించేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, మంజూరైన ఖబర్‌స్తాన్‌ను రద్దు చేయాలని జెడ్పీటీసీ వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్థలంలో గురుకుల పాఠశాలతో పాటు వసతిగృహాన్ని నిర్మించాలని సూచించారు. జీఓను ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్య, నాయకులు శంకర్‌నాయక్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు